ధర్మానిదే విజయం

బ్రహ్మంగారిమఠం: ధర్మానిదే అంతిమ విజయమని.. పాండవులు ధర్మానికి, కౌరవులు అధర్మానికి ప్రతీకలుగా నిలిచారని సి.సుబ్బారెడ్డి తెలిపారు. బి.మఠం కొత్తబస్వాపురంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మ పరిషత్ ప్రచారకుడు చాపాటి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాగద్వేషాలు , కుట్రలు, కుతంత్రాల వంటి అధర్మ చర్యలకు పాల్పడిన కౌరవులు చివరకు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, వీరాంజనేయులు, సుబ్బరాయుడు, ప్రసాద్, నాగలక్ష్మమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టికెట్ల ధరలకు అడ్డుకట్ట వేయాలి

ప్రొద్దుటూరు : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టికెట్ల ధరలకు అడ్డుకట్ట వేయాలని ఏపీ రాష్ట్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు సీటు కెపాసిటీ మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని, లగేజీ రవాణా కూడా చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆర్టీఓ, ఆర్టీసీ డిపో అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక టికెట్ ధరలకు కళ్లెం వేయాలని కోరారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

పోరుమామిళ్ల : ఆరోగ్యశ్రీలో మార్పు సరికాదని, ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పథకం మార్పులు లేకుండా కొనసాగేలా చూడాలని గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. హైబ్రీడ్ మోడల్‌తో ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభం అన్నారు. నిరుపేద రోగులకు అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించడంలో ఉదాసీనంగా వ్యవహరించడం తగదని, పేద ప్రజలు అనారోగ్యం పాలైతే మానవతా దృక్పథంతో ఆదుకోవాలే తప్ప ట్రస్ట్ మోడల్‌లో ఉన్న ఆరోగ్యశ్రీని హైబ్రిడ్ మోడల్‌లోకి మార్చడం మంచిదికాదన్నారు. పేదల ఆరోగ్యం కాపాడే సంజీవనిలాంటి పథకం ఆరోగ్యశ్రీ అని, వైద్యం కోసం అప్పుల పాలవుతున్న పేదలను ఆదుకునేందుకు తెచ్చిన గొప్ప పథకమన్నారు. ప్రజల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే అన్నట్లు భావించి వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి మానవత్వంతో అమలు చేసిన పథకమన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఏర్పాటయ్యేనాటికి 1059 ప్రొసీజర్లనే అనుమతించారని, వైఎస్ జగన్ 3257కు పెంచారన్నారు. 919 నెట్‌వర్క్ ఆసుపత్రులను 2300కు పెంచారని, రూ.1000 ఖర్చు దాటిన ప్రతి వైద్యాన్ని పథకంలో చేర్చారన్నారు. కవరేజ్‌ను రూ.25 లక్షలకు పెంచారని, ఆదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో రాష్ట్రంలో 1.5 కోట్ల కుటుంబాల్లో 95 శాతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయన్నారు. 2019లో చంద్రబాబు దిగిపోతూ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.632 కోట్లు బకాయి పెడితే దాన్ని వైఎస్సార్‌సీపీ చెల్లించిందన్నారు. 6 నెలల్లోనే ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిందన్నారు. రూ.3 వేల కోట్లు బకాయి పెట్టడంతో ఆసుపత్రులు వైద్యాన్ని నిలిపి వేశాయన్నారు. ఆపరేషన్ తరువాత వైద్యులు సూచించినంతకాలం రోగికి రోజుకు రూ.225 లేదా నెలకు గరిష్టంగా రూ.5 వేలు వైఎస్సార్‌సీపీ చెల్లించిందని దాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని సమీక్షించి ఆరోగ్యశ్రీలో హైబ్రీడ్ విధానానికి స్వస్తి చెప్పి, ట్రస్ట్ మోడల్‌లోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

అక్రమ కుళాయి కనెక్షన్లు రెగ్యులర్ చేయించుకోవాలి

బద్వేలు అర్బన్ : ఆయా వార్డుల్లో ఉన్న అక్రమ కుళాయి కనెక్షన్లను తక్షణమే రెగ్యులర్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా రఘునాథపురం, రఘునాథపురం దళితవాడలలో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేసేంత వరకు మురుగునీరు రోడ్లపైకి వదలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ జాగాల యజమానులతో సచివాలయ సిబ్బంది మాట్లాడి శుభ్రం చేయించాలన్నారు. నీటి సరఫరా సిబ్బంది క్రమం తప్పకుండా క్లోరిన్ టెస్టులు చేయడంతో పాటు నీటి వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతిఒక్కరు ప్లాన్ అప్రూవల్ పొందిన తర్వాతనే ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బి.కాం విద్యార్థిని వై.అరుణ కడప యోగివేమన యూనివర్సిటీలో మంగళవారం జరిగిన 3వ దశ కాలేజీయేట్ బాల్ బ్యాడ్మింటన్ ఉమెన్ టోర్నమెంట్, సెలక్షన్ ట్రయిల్స్‌లో ప్రతిభ చూపింది. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన అరుణ త్వరలో తమిళనాడు అలగప్పా యూనివర్సిటీలో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ ఉమెన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అరుణను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ ఎల్‌ఏ నిషాల్, అధ్యాపకులు అభినందించారు.


అరుణను అభినందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్

కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

ఖాజీపేట : కూటమి పాలనలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని ఏపీఎస్సార్టీసీ కడప మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం పేదలకు రక్షణగా నిలిచిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని చక్కగా అమలు చేసి మరింత భరోసా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3వేల బకాయిలు పెట్టి.. సేవలు నిలిపివేయడం తగదన్నారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా అని చెప్పిన కూటమి నాయకులు అధికారం చేపట్టగానే వదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.25 లక్షలకు పెంచి 1.5కోట్ల కుటుంబాలకు పథకం వర్తింపజేసిందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

చాపాడు : మడూరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మడూరు సచివాలయంలో బుధవారం పంచాయతీ అభివృద్ధి సమావేశం నిర్వహించారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

చాపాడు: రబీలో ఆరుతడి పంటలు సాగు చేసుకునే రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని అనంతపురం , తుమ్మలపాడు, ఎస్.ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. గ్రామంలో సాగైన జొన్న పంటను పరిశీలించామని తెలిపారు. జొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమ్మామీన్నేషన్ బెర్జోట్ నోవలోన్ 2.5 మి.లీ మందును లీటరు నీటికి కలిపి, 9:19:19 నుంచి 10 గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలతో ఆర్టీఓ బుధవారం సమావేశం నిర్వహించారు. తెలంగాణాతో పాటు చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగకు ప్రొద్దుటూరుకు వస్తారన్నారు. అయితే రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రావెల్స్ యజమానులు రేట్లు పెంచరాదని ఆర్టీఓ చెప్పారు. సమావేశంలో ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్రనాయక్, హేమకుమార్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9, 10, ఇంటర్ విద్యార్థినులకు బుధవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సంస్థ గౌరవ సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పట్ల గౌరవ భావం కలిగించేందుకు తల్లిదండ్రులు–ప్రాముఖ్యత అంశంపై పోటీలు నిర్వహించామని తెలిపారు. బాలికలకు సమాజంలో మనో ధైర్యాన్ని ఇవ్వడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, వెంకటసురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురం, కలసపాడు బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, శంఖవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు 200 మంది పదవ తరగతి విద్యార్థులకు రాజుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.వెంకటసుబ్బారెడ్డి దాతృత్వంతో బుధవారం స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఎస్టీయూ కేవలం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాక సమాజసేవలో సైతం తనవంతు సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో చాలా నిర్లిప్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పేరుతో ఇళ్లు కూల్చితే ఒప్పుకునేది లేదు

ప్రొద్దుటూరు రూరల్ : గోపవరం గ్రామ పంచాయతీ మైలవరం ఉత్తర కాలువ కట్ట మీద వేసుకున్న ఇళ్ల విషయంలో కాలువ పూడికతీత పేరుతో ఇళ్లను కూల్చివేస్తే ఒప్పుకునేది లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. కాలువ కట్టపై ఉన్న ఇళ్ల యజమానులతో బుధవారం ఆయన కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ కట్ట మీద 30 ఏళ్ల కిందట ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారన్నారు. కూలి పనులు చేసుకునే నిరుపేదలని, వారికి గోపవరం గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. మైలవరం కాలువకు పూడిక తీసే విషయంలో కాలువపై వేసుకున్న బండలను తొలగిస్తే ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటికి రాలేరన్నారు. కాలువ మీద అక్కడక్కడ ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పూడిక తీసుకోవాలన్నారు. కాలువ కట్టపై నివాసం ఉన్న నిరుపేదలపై అధికారులు కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, శరత్ బాబు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు శిక్షణ

మైదుకూరు : మహిళలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. స్థానిక కేవీకేలో పోషకాహారంపై కిశోర బాలికలకు బుధవారం అవగాహన కల్పించారు. డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలను భాగం చేసుకోవాలన్నారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు విద్యారాణి, కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి ఆటలపోటీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంక్రాంతి పండుగ ఆటలపోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు మ్యూజికల్ చైర్, విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు మెమెంటోలు ఇస్తామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చారి తెలిపారు.

రిలే నిరాహారదీక్షలను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సమ్మెకాలపు ఒప్పందాల జీవోల అమలు కోసం ఈనెల 10 న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద చేపడుతున్న రిలే దీక్షలను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ అధ్యక్షుడు పులిశ్యాం ప్రవీణ్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ పట్టణ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు.

వెల్లాల ఆలయానికి రూ.15.80 లక్షల ఆదాయం

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాల హుండీ ఆదాయం, పోగు చేసి నిల్వ ఉంచిన తలనీలాల ద్వారా రూ.15,80,960 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కేవీ రమణ తెలిపారు. ఆలయాల్లోని ధ్యానమందిరంలో బుధవారం 10 నెలల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.13,15,960 ఆదాయం రాగా, పోగు చేసి నిల్వ ఉంచిన తలనీలాలకు రూ.2,65,000 వచ్చిందని ఈఓ వివరించారు.

బద్వేలు.. బస్తీ దిశగా అడుగులు


సుందరంగా రూపుదిద్దుకున్న బద్వేలు పట్టణంలోని ఓ రహదారి

బద్వేలు అర్బన్ : కాలజ్ఞాని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు చెప్పిన ప్రకారం బద్వేలు పట్టణం బస్తీ దిశగా అడుగులు వేస్తోంది. విద్య, వ్యాపార, వాణిజ్య రంగాల్లో దినదినాభివృద్ధి చెందడంతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో పట్టణ రూపురేఖలు శరవేగంగా మార్పు చెందాయి.

విద్య, వ్యాపార రంగాల్లో విప్లవాత్మక మార్పులు

సరిగ్గా పదేళ్ళ క్రితం వరకు విద్య, వ్యాపార రంగాలకు సంబంధించిన అవసరాల కోసం ఇక్కడి ప్రజలు నెల్లూరు, కడప, ప్రొద్దుటూరు లాంటి పట్టణాలకు వెళ్ళాల్సి వచ్చేది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బద్వేలు పట్టణంలో కార్పొరేట్ స్థాయికి తగ్గట్టు వసతులతో కొన్ని ప్రైవేటు పాఠశాలలు కళాశాలలను తీర్చిదిద్దారు. అత్యుత్తమ బోధన, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వంటి విధానాలతో చాలా మంది దూర ప్రాంతాలకు వెళ్ళకుండా పట్టణంలోనే విద్యనభ్యసిస్తున్నారు. మరోవైపు వ్యాపార రంగంలో కూడా బద్వేలు పట్టణం ప్రత్యేక స్థానం సొంతం చేసుకుంటోంది. ఒకప్పుడు మహానగరాలకు మాత్రమే పరిమితమైన షాపింగ్‌మాల్స్ కల్చర్ బద్వేలు పట్టణంలో కూడా కొనసాగుతోంది. వస్త్రదుకాణాలు, బంగారు దుకాణాలను మహానగరాలలో మాదిరిగా సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో శుభకార్యాలకు దూర ప్రాంతాలకు వెళ్ళి కొనుగోలు చేయకుండా పట్టణంలోనే వస్త్రాలు, బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంటున్నాయి.


బద్వేలు పట్టణంలో సర్వాంగ సుందరంగా నిర్మితమైన వేంకటేశ్వరస్వామి ఆలయం


సిద్దవటం రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వెలుగులు

జోరుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం

బద్వేలు బస్తీ అవుతుందని కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వాములవారు చెప్పి ఉండటంతో ఈ ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున రియల్టర్లు వస్తుంటారు. దీంతో స్థలాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దానికి తోడు బద్వేలు పరిసర ప్రాంతంలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. అత్యాధునిక వసతులతో వెంచర్లు వెలిశాయి. అంతేకాకుండా ఆసుపత్రులు, ఫంక్షన్ హాల్స్, రెస్టారెంట్లు, ఆలయాలు గతంలో కంటే భిన్నంగా రూపుదిద్దుకున్నాయి. అంతేకాకుండా బద్వేలుకు రెవెన్యూ డివిజన్ హోదా కూడా దక్కడంతో ఆ స్థాయిలోనే పట్టణం కూడా వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకెళుతోంది.

ప్రతి పాఠశాలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయండి

పోరుమామిళ్ల : వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ క్లినిక్ సెంటర్లలోని ఎంఎల్‌హెచ్‌పీలు మీ మీ పరిధిలోని ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేయాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ ఆదేశించారు. బుధవారం మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రాష్ట్ర బాల ఆరోగ్య కార్యక్రమంపై ఏఎన్ఎంలు, హెల్త్ క్లినిక్ సెంటర్లలోని ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని సమీక్షించారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి అంటువ్యాధులకు సంబంధంలేని వ్యాధులపై పరీక్షలు చేయాలన్నారు.